సేవలు అభినందనీయం

• లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ బ్రియాన్

మాట్లాడుతున్న లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఇంటర్నేషనల్ చైర్మన్లు

శక్కర్‌నగర్, డిసెంబర్ 21: లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 21 ఏండ్లుగా సేవలు అందించడం అభినందనీయమని లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ బ్రియాన్, మాజీ ఇంటర్నేషన్ అధ్యక్షుడు అయన్ ఈ షీహాన్ అన్నారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రం శివారులో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన లయన్స్ క్లబ్ హోమ్ ఫర్ ఏజ్డ్ పర్సన్ , బోధన్ రాకాసిపేట్‌లోని కంటి దవాఖానలో రూ. కోటితో నూతనంగా నిర్మించిన ఆడిటోరియం, ఆపరేషన్ థియేటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వారికి లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడంతో పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. లయన్స్ జిల్లా 320డి గవర్నర్, బోధన్ లయన్స్ ట్రస్ట్ సభ్యురాలు వేమూరి లక్ష్మి ఆధ్వర్యంలో దేశంలోనే స్వచ్ఛంద కార్యక్రమాల్లో రెండో స్థానంలో నిలపడంపై లయన్స్ ఇంటర్నేషనల్ తరపున వారు శుభాకాంక్షలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు లయన్ పోలవరపు బసవేశ్వర్ రావునూఅభినందించారు. గౌరవ అతిథిగా హాజరైన బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతీ శరత్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కార్యదర్శి లయన్ విజయ్ కుమార్ రాజు, జిల్లా గవర్నర్ వేమూరి లక్ష్మి, లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు పోలవరపు బసవేశ్వర్ రావు, మాజీ గవర్నర్ పెంటయ్య, లయన్స్ కంటి దవాఖాన చైర్మన్ లయన్ నర్సింహారెడ్డి, కోశాధికారి ప్రకాశ్ గుప్తా, శశిభూషన్, జిల్లా రెండవ గవర్నర్ లయన్ అమర్‌నాథ్ రావు, జిల్లా జీఎల్‌టీ కో-ఆర్డినేటర్ లయన్ ఎం. నాగరాజు, లయన్స్ బోధన్ ట్రస్ట్ సభ్యులు ఇందూర్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ లయన్ కొడాలి కిశోర్, వై. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రెంజల్/జక్రాన్‌పల్లి, డిసెంబర్ 21: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ వికార్‌పాషా అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం రెంజల్ మండలంలోని సాటాపూర్, బోర్గాం గ్రామాల్లో సర్పంచులు వికార్‌పాషా, వాణి సాయిరెడ్డి అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ పథకాలపై మండల, గ్రామ స్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, సాటాపూర్ ఎస్‌బీఐ మేనేజర్ లక్ష్మీ నారాయణశాస్త్రి, ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి, అయూష్మాన్ వైద్యాధికారిణి ప్రమోదితా తదితరులు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాకలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మానందం, సర్పంచ్ ఆత్మకూర్ గంగూబాలయ్య, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ బిష్టిబొమ్మ దహనం

ఆర్మూర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భీమ్‌గల్/వేల్పూర్/ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 21: భారత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీశ్ దంకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను గురువారం జిల్లాలోని పలు చోట్ల బీజేపీ నాయకులు దహనం చేశారు. భీమ్‌గల్‌లో ఆపార్టీ నాయకులు పాల్గొన్నారు. నాయకులు సంధ్య రాజు, లక్ష్మీనారాయణ, ఉప్పల నవీన్, రాగి నవీన్, రాగి అజయ్, బోనికే రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.ఆర్మూర్‌లో ఆ పార్టీ నాయకులు పుప్పల శివరాజ్, ద్యాగ ఉదయ్, ఆకుల శ్రీను, జెస్సు అనిల్, మిల్యాకర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీశ్ దంకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ మండల కన్వీనర్ రమేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్21: ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కంబ హిమతేజ, పల్లపు సాయిచరణ్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం హరిత తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఒడిసాలో ఈనెల 24 నుంచి 29 వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం అభినందించారు.

రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు..

మెండోరా, డిసెంబర్ 21: మండలంలోని పోచంపాడ్ పాఠశాలకు చెందిన వి.ఆకాశ్, విజ్ఞాన్‌రాజ్, ఆల్మాస్, మొహిత్ రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎ.మనోహర్, పీఈటీ భూపతి గురువారం తెలిపారు. ఈనెల 24 నుంచి 26 వరకు తొర్రూర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివించాలి


సదస్సును ప్రారంభిస్తున్న ఆర్డీవో రాజా గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతీ శరత్‌రెడ్డి

బోధన్, డిసెంబర్ 21: అందరూ తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివించాలని బోధన్ ఆర్డీవో బి.రాజాగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతీ శరత్ రెడ్డి సూచించారు. గురువారం బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆర్డీవో, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యాలయాలకు బోధన్ కేంద్ర బిందువని, ఎడ్యుకేషనల్ హబ్‌గా ఉందని, ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా ఉందని అన్నారు. బోధన్ సమీప ప్రాంతాలకు చెందిన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని వారు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. బోధన్ కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ కౌసర్, అధ్యాపకులు వివరించారు. జూనియర్ కళాశాలలో ఆరోగ్య శిబిరం, పుడ్‌మేళా, పుస్తక ప్రదర్శనతోపాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని సవరించాలి

బాల్కొండ,డిసెంబర్ 21: ఈనెల 9న రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభించి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో చాలా నష్టాలు జరుగుతున్నాయని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) మండల కమిటీ నాయకులు అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆటో కార్మికులకు నెలకు రూ.3వేల చొప్పున ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేస్తూ మండల అభివృద్ధి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల కన్వీనర్ నిశాంత్ మహరాజ్, మండల నాయకులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ఎడపల్లి, డిసెంబర్ 21: పరీక్షల్లో ప్రతిభ చూపిన మండల కేంద్రం శివారులోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ బోధన్ శాఖ ఆధ్వర్యంలో గురువారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షురాలు పద్మావతి, పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసినీ రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రెంజల్, డిసెంబర్ 21: నీలా వైపు నుంచి బుధవారం రాత్రి ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను సాటాపూర్ తెలంగాణ చౌరస్తా వద్ద పట్టుకున్నట్లు ఎస్సై పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించామని అన్నారు.

టార్పాలిన్ల పంపిణీ

మెండోరా, డిసెంబర్ 21: చాకిర్యాల్ గ్రామంలో గురువారం ఐసీఐసీఐ ఫౌండేషన్ ద్వారా రైతులకు సబ్సిడీతో టార్పాలిన్ కవర్లను అందజేశారు. రైతులకు పంట నాణ్యత పెంపుదలకు ఏడు రోజులపాటు శిక్షణ ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నామని ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగు దేవన్న, ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రతినిధులు సాయికుమార్, ఉప్పరి లక్ష్మీ నారాయణ తదితరులు ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం

మోర్తాడ్, డిసెంబర్ 21: ఈనెల 23 నుంచి 25వరకు హిందుస్థాన్ ఎరోనాటికల్ లిమిటెడ్ గ్రౌండ్స్ సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న 69వ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషుల జట్టుకు తిమ్మాపూర్ గ్రామంలో శిక్షణ శిబిరాన్ని గురువారం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ శ్యామ్, సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి, ఉప సర్పంచ్ నవీన్, జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేస్తున్న ముప్కాల్ రిటైర్డ్ హెచ్ఎం అంజయ్య

బాల్కొండ, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని కేజీబీవీకి ముప్కాల్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అంజయ్య గురువారం కంప్యూటర్‌ను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తేవాలని అన్నారు. అనంతరం అంజయ్యను పాఠశాల బృందం ప్రత్యేకంగా సన్మానించింది. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో భవాని, గంగాధర్, శివ శంకర్, కనకయ్య, రాజ్‌కుమార్, స్రవంతి, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు బ్లాంకెట్ల పంపిణీ

బోధన్, డిసెంబర్ 21: బోధన్ పట్టణంలో పేద వృద్ధులకు గురువారం తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కన్ఫడరేషన్ అనుబంధ సంస్థ బోధన్ డివిజన్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో బ్లాంకెట్లను ఆ ఫోరం ప్రతినిధులు పంపిణీ చేశారు. పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బోధన్ డివిజన్ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు మురహరి, కార్యదర్శి బి.ముత్తయ్య, కోశాధికారి ఎస్.కాకయ్య, ఫోరం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్21: పట్టణంలోని ప్రధాన రోడ్ల పక్కన అక్రమంగా ఏర్పాటు చేసుకున్న పండ్ల దుకాణాలను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదుట రోడ్డును ఆక్రమించుకొని ఏర్పాటు చేసిన దుకాణాలను మున్సిపల్, ఆర్టీసీ అధికారులు, పోలీసులు తొలగించారు. అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలు మాస్కులు ధరించాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్21: కరోనా వ్యప్తి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, బయటికి వెళ్తే తప్పకుండా మాస్కులు ధరించాలని వైద్యులు అన్నారు. దేశంలో కరోనా కేసుల వ్యాప్తి చెందుకున్న నేపథ్యంలో ఆర్మూర్ ఏరియా దవాఖాన అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానికంగా కరోనా కేసులు నమోదైతే వైద్య సేవలు అందించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ దవాఖానలో ఆక్సిజన్ సౌకర్యంతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యవసర సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొనారు. ఇంట్లో శుభ్రత పాటించాలని పేర్కొన్నారు. వైద్యులు అమృతా రాంరెడ్డి, సుమంత్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, కారు ఢీ

• 12మంది విద్యార్థులకు గాయాలు

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 21: మండలంలోని సికింద్రాపూర్ పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై గురువారం ఆటో, కారు ఢీకొన్న ప్రమాదంలో 12మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బాల్‌నగర్ నుంచి సికింద్రాపూర్ ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటోను ఆర్మూర్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 10మంది విద్యార్థులకు స్వల్పగాయాలు కాగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గాయపడిన విద్యార్థులను ఎంపీపీ కుంచాల రాజు పరామర్శించారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

గాయపడ్డ వారికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మెస్ బిల్లులపై విచారణ చేపట్టాలి

ఇందల్వాయి, డిసెంబర్ 21: హాస్టల్ మెస్ బిల్లులపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ కమిటీ సభ్యులు యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులపై మెస్ చార్జీల పేరిట అధిక భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నాయకులు చిత్తు, పవన్, విక్రమ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ సమస్యలు పరిష్కరించాలని..

టీయూలో హెల్త్‌కేర్ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు మోహిత్, శివసాయి, రవీందర్ అన్నా రు. టీయూలోని హెల్త్ కేర్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. హెల్త్‌కేర్ సెంటర్ నిత్యం తెరిచి ఉండడం లేదని, సిబ్బంది రావడం లేదని, అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాల అథ్లెటిక్స్ ఎంపికలు ప్రారంభం

జెండా ఊపి ఎంపికలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ బాలకిషన్

ఇందల్వాయి, డిసెంబర్ 21: ఇంటర్ కళాశాల అథ్లెటిక్స్ ఎంపికలను తెలంగాణ విశ్వవిద్యాలయంలోని క్రీడా మైదానంలో డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్ గురువారం ప్రారంభించారు. క్రీడా నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేస్తామని, సౌత్ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు టీయూ తరపున పాల్గొంటారని బాలకిషన్ తెలిపారు. సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ అట్లాంటిక్ (మెన్) టోర్నీ ఈనెల 29 నుంచి జనవరి 1 వరకు చెన్నైలో జరుగుతుందన్నారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది కళాశాలల క్రీడాకారులు దాదాపు 200 మందికి పైగా హాజరయ్యారు. కార్యక్రమంలో వర్సిటీ క్రీడా విభాగం సహాయ ఆచార్యులు (కాంట్రాక్ట్) డాక్టర్ బీఆర్.నేత, వివిధ కళాశాలల పీడీలు అనిల్‌కుమార్, రాంకిషన్, సౌమ్య, జూనియర్ అసిస్టెంట్ నరేశ్ జాదవ్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ అబ్జర్వర్‌గా గంగామోహన్

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 21: 67వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు అబ్జర్వర్‌గా మిట్టాపల్లి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మార్కంటి గంగామోహన్‌ను నియమిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సంగీతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి చిప్ప నవీన్ అభినందించారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విజయ్ విద్యార్థులు

ఖిల్లీవాడి, డిసెంబర్ 21: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విజయ్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 19 వరకు వనపర్తి జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన సీహెచ్. హరిణీయాదవ్, సీహెచ్. జాహ్నవి యాదవ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కార్యదర్శి అమృతలత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హెచ్ఎంకు సన్మానం

వేల్పూర్, డిసెంబర్ 21: వాడీ గ్రామ ప్రాథమిక పాఠశాల నుంచి ఆర్మూర్ మండలానికి బదిలీపై వెళ్లిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం చెన్నయ్యకు వాడీ పాఠశాల తరపున గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాషిద్, పీఆర్‌టీయూ వేల్పూర్ మండల అధ్యక్షుడు అంకం నరేశ్, ఎస్ఎంసీ చైర్మన్ మల్లయ్య, ఉపాధ్యాయులు ఓంకార్, రతన్, లింబగిరి స్వామి పాల్గొన్నారు.

లక్ష్యసాధనే ధ్యేయంగా చదవాలి

శక్కర్‌నగర్, డిసెంబర్ 21:విద్యార్థులు లక్ష్యసాధనే ధ్యేయంగా విద్యాభ్యాసం కొనసాగించాలని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, లయన్ ఎ.అమర్‌నాథ్ రావు సూచించారు. గురువారం బోధన్ పట్టణంలోని శ్రీ విజయసాయి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అంశంపై ఆయన సూచనలు చేశారు. అమర్‌నాథ్ రావును పాఠశాల తరపున సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కృష్ణ మోహన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఖిల్లీవాడి, డిసెంబర్ 21: బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీని సుభాష్‌నగర్‌లోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో గురువారం ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి సుజిత్ ఠాకూర్, రాష్ట్ర కన్వీనర్ పోతన్కర్ లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, రాష్ట్ర ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి రేవంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలకిషన్ ఆధ్వర్యంలో జిల్లా బీసీ సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా మహిళా అధ్యక్షురాలిగా మడా స్వప్న, కార్యదర్శిగా చింతకాయల రాజేశ్, జాయింట్ సెక్రటరీలుగా గోపరి లక్ష్మణ, ఎం. శివకుమార్, పాక సురేశ్, ఉపాధ్యక్షుడిగా జి.నరేందర్, పట్టణ అధ్యక్షుడిగా ధాత్రిక రతన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.కృష్ణప్రసాద్, పట్టణ సెక్రటరీగా కుర్లం శివ, పట్టణ జనరల్ సెక్రటరీగా పిట్టల కృష్ణ, స్టూడెంట్ యూనియన్ సెక్రటరీగా చైతన్య కృష్ణకు నియామక పత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్, లక్ష్మణ్‌రావు, వినోద్, సాయా గౌడ్ పాల్గొన్నారు.

దుబ్బాక వీడీసీ సభ్యుల రిమాండ్

నిజామాబాద్ క్రైం,డిసెంబర్ 21: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామంలో పద్మశాలీ కులానికి చెందిన 40 కుటుంబాలను బహిష్కరిస్తూ, వారిపై రూ.50వేల జరిమానా విధించిన వీడీసీ సభ్యులు ఐదుగురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అదనపు డీసీపీ ఎస్.జయరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశాలీ కులానికి చెందిన సర్వే నంబర్ 979 అసైన్డ్ భూమిని వీడీసీ సొంతం చేసుకునేందుకు పద్మశాలీ కులస్తులను బహిష్కరించి, జరిమానా విధించడంపై వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. వీడీసీకి చెందిన కొత్తి రాజశేఖర్, పెండ అరుణ్, దొంకెన చిన్న గంగారాం, భుర్కి నర్సాగౌడ్, భూమేడ మురళిని గురువారం నిజామాబాద్ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చామన్నారు. వీడీసీలు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు డీసీపీ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

పేకాట అడ్డాపై దాడి

నిజామాబాద్ క్రైం,డిసెంబర్ 21: నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం నిజామాబాద్ ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేకాట అడ్డాపై బుధవారం దాడి చేశారు. సారంగాపూర్ కెనాల్ కట్ట సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.18,240 నగదు, ఆరు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న వారిని ఆరో టౌన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు సీపీ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

బ్యాంకింగ్‌పై అవగాహన

ధర్పల్లి, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని లిటిల్ హార్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు బ్యాంకుల నిర్వహణ, ప్రజల ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంకును క్షేత్రస్థాయిలో సందర్శించారు. వారి వెంట హెచ్ఎం సాధన, ఉపాధ్యాయురాలు పద్మ, లింబాద్రి ఉన్నారు.

ముప్కాల్‌లో..

ముప్కాల్, డిసెంబర్ 21: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముప్కాల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాంకు లావాదేవీలు, కిడ్డీ బ్యాంకు ఉపయోగాన్ని బ్యాంకు మేనేజర్ రాంచందర్ కుమార్ వివరించారు. ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ గడ్డం హరీశ్ రెడ్డి, బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్కులను శుభ్రంగా ఉంచాలి : మేయర్

కార్పొరేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న నగర మేయర్ దండు నీతూకిరణ్

ఖిల్లీవాడి, డిసెంబర్ 21: పార్కులను శుభ్రంగా ఉంచాలని, ఓపెన్ జిమ్‌లో నిరుపయోగంగా ఉన్న పరికరాలకు మరమ్మతులు చేయించాలని నగర మేయర్ దండు నీతూకిరణ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని అమరులవీరుల పార్కు, న్యూ ఎన్జీవోస్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న పంచతత్వ పార్కు, బస్వా గార్డెన్ సమీపంలోని పార్కులను ఆమె సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. స్థానికంగా ఉన్న ప్రజలు పార్కులను ఉపయోగించుకోవాలని సూచించారు. మేయర్ వెంట స్థానిక కార్పొరేటర్ ఉమారాణీశ్రీనివాస్, మున్సిపల్ ఇంజినీర్ సల్మాన్‌ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజ్‌గౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాలలో గణితశాస్త్ర కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేలపై వేసిన రామానుజన్ చిత్రపటం ఆకట్టుకున్నది. – సిరికొండ, డిసెంబర్ 21

PUBLIC NOTICE

General public are hereby informed that